ఎల్‌ఆర్‌ఎస్‌తో క్రమబద్ధీకరణ

- అనధికార లేఅవుట్లు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు అవకాశం
- అక్టోబరు 24 వరకు దరఖాస్తునకు గడువు
- 14 శాతం ఫీజులో 50 శాతం రాయితీ


ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నిర్మిస్తున్న లేఅవుట్

ఆత్మకూరు: ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్ ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. ఇందుకు సంబంధించి జూలై 26వ తేదీన జీఓ విడుదల చేసింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తునకు అక్టోబరు 24వ తేదీ వరకు గడువు ఇచ్చింది. మున్సిపల్ పరిధిలో అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. రియాల్టర్ల మాయమాటలు విని పలువురు లక్షలాది రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేశారు. కొందరు అప్పులు చేసి మరీ ప్లాట్లు తీసుకున్నారు. ఇటీవల మున్సిపల్ అధికారులు అనధికార లేఅవుట్లను గుర్తించి రహదారులకు గండ్లు కొట్టడం, మార్కింగులు, రాళ్లు చెరిపివేయడం, నోటీసులు ఇవ్వడం వంటి చర్యలకు దిగిన విషయం తెలిసిందే. దీంతో ప్లాట్ల కొనుగోలుదారులు తమ పరిస్థితి ఏమిటా అని దిగాలు చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. సాధారణంగా లేఅవుట్లలో 10 శాతం రిజర్వు స్థలం వదలకపోతే మార్కెట్ విలువ ఆధారంగా 14 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 10 శాతం రిజర్వు స్థలం వదిలి ఉంటే 1 లేదా 2 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. కాగా ఎల్‌ఆర్‌ఎస్ కింద అనధికార లేఅవుట్లలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన 14 శాతం ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తున్నారు. అంటే ఏడు శాతం ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

90రోజుల గడువు

ఎల్‌ఆర్‌ఎస్ స్కీంకు 90 రోజుల గడువు ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 45 రోజుల్లోగా మొత్తం చార్జీలు చెల్లిస్తే అదనంగా మరో 10 శాతం రాయితీ ఇస్తారు. నిర్దేశించిన 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు ఉంటాయని చెబుతున్నారు. ఉదాహరణకు పదేళ్ల క్రితం అనధికార లేఅవుట్‌లో అప్పటి మార్కెట్ విలువ ప్రకారం గజం రూ.5వేలు చొప్పున వంద గజాల ప్లాట్‌ను కొనుగోలు చేస్తే విలువ రూ.5 లక్షలు అవుతుంది. పదేళ్ల క్రితమే క్రమబద్ధీకరణ చేసి ఉంటే 14 శాతం ప్రకారం రూ.75వేలు ఖర్చు అవుతుంది. అదే ఎల్‌ఆర్‌ఎస్ స్కీములో పెట్టుకుని క్రమబద్ధీకరించుకుంటే రూ.37,500 ఖర్చు అవుతుంది. ప్రస్తుత మార్కెట్ ప్రకారం అదే స్థలం గజం ధర రూ.10వేలు ఉంటే 100 గజాల విలువ రూ.10 లక్షలు అవుతుంది. నేటి మార్కెట్ విలువ ప్రకారం క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే రూ.1.4 లక్షలు ఖర్చు కాగా, ఎల్‌ఆర్‌ఎస్ స్కీము ద్వారా రూ.70వేలు అవుతుంది. ఈ విషయాన్ని ప్లాట్ల యజమానులు గుర్తించి ఎల్‌ఆర్‌ఎస్ స్కీమును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు.

12కుపైగా అనధికార లేఅవుట్లు

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో 12 అనధికార లేఅవుట్లు ఉన్నట్లుగా మున్సిపల్ అధికారుల సమాచారం. వీటిలో సుమారు 270 నుంచి 310 వరకు ప్లాట్లు ఉన్నట్లు అంచనా. ఇవేగాకుండా పట్టణంలో క్రమబద్ధీకరణ చేయించుకోవాల్సిన స్థలాలు ఇంకా ఉన్నట్లుగా మున్సిపల్ సిబ్బంది తెలిపారు. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఇవి వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమబద్ధీకరణ చేయించుకోవాలని కోరుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తునకు అక్టోబర్ 24 వరకు గడువు ఉంది. క్రమబద్ధీకరణ చేసుకున్న లేఅవుట్లలో ప్రభుత్వ బాధ్యతగా అన్ని మౌలిక వసతులు పొందేందుకు అవకాశం ఉంటుంది. దీనికితోడు భవన నిర్మాణాలకు అనుమతులు సులభంగా పొందవచ్చు.

–సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్

బోరుకు మరమ్మతులు చేపట్టరూ..



ఉదయగిరి: ఉదయగిరి దుర్గంపై ఉన్న ఝట్‌పట్ బీబీ దర్గా ఆవరణంలోని బోరు మరమ్మతులకు గురవడంతో పర్యాటకులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు దుర్గాన్ని సందర్శిస్తుంటారు. మధ్యాహ్న సమయంలో మార్గం మధ్యలోని దర్గా ఆవరణలో సేదతీరడంతో పాటు భోజనాలు చేస్తుంటారు. చేతిబోరు మరమ్మతులకు గురై పని చేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. త్వరలో దర్గాలో గంధమహోత్సవం, దుర్గంపై వనభోజన కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో అధికారులు స్పందించి చేతిబోరుకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైభవంగా కాశీవిశ్వేశ్వరుని గ్రామోత్సవం



సంగం: మండలంలోని పెరమనలో కాశీవిశ్వేశ్వరుని గ్రామోత్సవాన్ని శనివారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. కాశీవిశ్వేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదిదంపతులకు శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌పై కొలువుదీర్చి పూలతో విశేషంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన నూతన వధూవరులైన ఆదిదంపతులను భక్తులు దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరాటం



ఉదయగిరి: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు. యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమానికి 51 ఏళ్లుగా అవిశ్రాంతంగా పనిచేస్తోందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయబ్, మున్నా, ఖాదర్‌బాషా, ఫణిరాజ్, చెంచయ్య, సుబ్బారెడ్డి, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'సారథ్యం' జయప్రదానికి పిలుపు



సీతారామపురం : ఈ నెల 13న నెల్లూరులో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సారథ్యం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాయిసందీప్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన అయ్యవారిపల్లిలో స్థానిక నాయకులతో సమావేశమయ్యారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నందున మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు. బీజేపీ నాయకులు కాశీరావు, నరసింహులు, వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య, వెంకటయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

14న కోవూరులో జాబ్‌మేళా

నెల్లూరు(పొగతోట): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఈనెల 14న కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్‌ఖయ్యూం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 800 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్‌మేళా జరుగుతుందని, కోవూరు నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ చదివిన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 93812 65558, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డీకేడబ్ల్యూ కళాశాలకు రూ.75 వేల వితరణ



నెల్లూరు(బారకాసు): స్థానిక శాంతినగర్ నిర్మల సౌధలో నెల్లూరు రెడ్ల ఐక్యవేదిక నెలవారీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాలలో కుర్చీల కోసం రూ.75 వేల చెక్కును ప్రిన్సిపల్‌కు అందజేశారు. అలాగే సంఘ సభ్యులు పెనాక సుజాతారెడ్డి రూ.2,500, ప్రదీప్‌రెడ్డి రూ.2,500లతో పాటు సంస్థ తరఫున మరో రూ.5 వేలు కలిపి పేద విద్యార్థి మారంరెడ్డి నితిన్‌కుమార్‌రెడ్డికి రూ.10 వేలు చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం ఈనెలలో జన్మదినం జరుపుకుంటున్న డాక్టర్ నిశ్చల్‌ప్రసాద్‌రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, బెజవాడ సునీల్‌కుమార్‌రెడ్డి, బత్తిన కుమారస్వామిరెడ్డి, పెనాక సుజాతారెడ్డి కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, కార్యదర్శి ప్రతాపరెడ్డి, కార్యవర్గ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు



దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆ సేవా సమితి దుత్తలూరు శాఖ సభ్యులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం వారు ఆవిష్కరించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో తిరిగి భక్తులకు కరపత్రాలను అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16న ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణుని పూజా కార్యక్రమం, భగవద్గీత పఠనంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 17,18 తేదీల్లో ప్రత్యేక పూజలు, 19న మధ్యాహ్నం 1 గంట నుంచి విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు. 21న పూజా కార్యక్రమాలు, భగవద్గీత శ్లోకాల పఠనం, శ్రీకృష్ణుడి ఊరేగింపు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సభ్యులు జీ పెంచలరత్నం, జీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులకు విలువ లేదు


నులి పురుగుల నివారణా కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పద్మజారెడ్డి

అనుమసముద్రంపేట: కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వడం లేదని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీపీ మండిపడ్డారు. ప్రజా సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని, గోడలకు, కిటికీలకు చెప్పమంటారా అని ఎంపీడీఓ ప్రసన్నకుమారిని ప్రశ్నించారు. రాజ్యాంగ చట్టాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వంతో పాటు అధికారులు సైతం ఉల్లంఘిస్తున్నారని, ఇంకెందుకు ఈ పదవులు అని ఎంపీపీ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్‌ల అనుమతులు లేకుండానే కూటమి నాయకులు సిమెంట్ రోడ్లు నిర్మించడమే కాకుండా సర్పంచ్‌ల సంతకాలు లేకుండానే బిల్లులు చేసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాలను అభివృద్ధి చేసేందుకు నిధులు సైతం లేవని, ఉంటే ఎన్ని లక్షలు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ చల్లేందుకు సైతం నిధులు లేవని సర్పంచ్‌లు చెబుతున్నారని, నిధులు లేకపోతే ఎలా అభివృద్ధి చేయాలని, ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి విద్యార్థికి అమ్మఒడి వస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మండలంలోని 500 మందికి తల్లికి వందనం అందలేదన్నారు. వీరిలో ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీలే ఉన్నారన్నారు. గతంలో ఆధార్ నంబర్‌తో అమ్మఒడి వచ్చేదని, ప్రస్తుతం సచివాలయంలో ప్రశ్నిస్తే ఆధార్ నంబర్ తప్పుగా నమోదు చేయడంతోనే రావడం లేదని చెప్పడం వారి తప్పిదానికి నిదర్శనమన్నారు. రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వ అధికారులు రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇలా అధికారులు గైర్హాజరయ్యే, అభివృద్ధి పనులకు నిధులు లేకుండా సమావేశాలు నిర్వహించడం ఎందుకని, అధికారులందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకుంటేనే మళ్లీ సమావేశం నిర్వహించాలని ఎంపీడీఓకు సూచించారు. అనంతరం జాతీయ నులి పురుగుల నివారణా కార్యక్రమం పోస్టర్లను డాక్టర్ జ్యోతిరాణితో కలిసి ఎంపీపీ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీటీ వెంకటేశ్వర్లు, మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాలె గూళ్లు తొలగేనా?


కావలిలోని క్రిస్టియన్‌పేటలో ఓ స్తంభానికి కట్టలు కట్టలుగా చుట్టి ఉన్న కేబుల్ వైర్లు

- స్తంభాలపై ప్రమాదభరితంగా కేబుల్‌వైర్లు
- విద్యుత్ లైన్‌మెన్లకు తప్పని ఇబ్బందులు

కావలి (జలదంకి): విద్యుత్ స్తంభాలపై ఏర్పాటు చేస్తున్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. కావలి పట్టణంతో పాటు మండలాల్లోనూ స్తంభాలకు విద్యుత్ వైర్లు మూడు వరుసలు ఉంటే కేబుల్ వైర్లు ఐదారు వరుసల్లో కనిపిస్తున్నాయి. స్తంభాలకు కేబుల్ వైర్లను చుట్టలు చుట్టలుగా కట్టేసి దర్శనమిస్తున్నాయి. అయినా విద్యుత్ శాఖ అధికారులు కిమ్మనకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. విద్యుత్ వినియోగం పెరిగిన సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో కేబుల్‌వైర్లకు మంటలు అంటుకుని చెలరేగే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో గాలులకు విద్యుత్ వైర్లు తెగి కేబుల్ వైర్లపై పడినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ ఘటనలు ప్రధాన రహదారుల మీద జరిగిన సమయంలో వాహనదారులు, పాదచారులు భయాందోళనలు చెందుతున్నారు.

అనుమతులు లేకుండానే..

విద్యుత్ స్తంభాలపై కేబుల్, ఇంటర్నెట్‌వైర్లను లాగేందుకు విద్యుత్‌శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అందుకు సంబంధించి విద్యుత్‌శాఖకు కొంత రుసుం సైతం చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొన్ని ప్రాంతాల్లో అనుమతులు తీసుకుంటుండగా, మరికొన్ని ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే కేబుల్ వైర్లు లాగేస్తున్నారు. స్తంభాలపైన ఇష్టమొచ్చినట్లుగా తీగలను కట్టేస్తున్నారు. దీంతో విద్యుత్ మరమ్మతులు చేయాల్సి వచ్చినప్పుడు లైన్‌మెన్లు స్తంభాలు ఎక్కేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో వాటి కారణంగా ప్రమాదాలకు సైతం గురవుతున్నారు. ఆ సమయంలో ప్రమాదాలకు బాధ్యులు ఎవరు అవుతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కొందరే అనుమతులు తీసుకుంటున్నారు

విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టేందుకు కొంతమందే అనుమతులు తీసుకుంటున్నారు. మరికొంతమంది తీసుకోవడం లేదు. స్తంభాల వద్ద విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం.

– కేఎస్ బెనర్జీ, విద్యుత్‌శాఖ ఈఈ, కావలి

బీఎస్పీ బలోపేతానికి కృషి

ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా సలహాదారు టీ కృష్ణ అన్నారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ ప్రధాన కార్యదర్శి శేషాద్రి ఆధ్వర్యంలో ఆదివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం మండల ఇన్‌చార్జి–2గా ఆళ్ల అంకులయ్య ఎంపిక చేశారు.

పరామర్శ

ఆత్మకూరు: అగ్రకులాలకు చెందిన వారి దాడిలో తీవ్రంగా గాయపడి ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేజర్ల మండలం మడపల్లికి చెందిన వసంతమ్మను బీఎస్పీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితురాలిని పరిశీలించి అట్రాసిటి కేసు నమోదు చేసినా అధికారులు ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకు తాము అండగా ఉంటామన్నారు. బీఎస్పీ నాయకులు టీ కృష్ణ, బుర్రా శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



చేజర్ల(సోమశిల): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల కోసం చేజర్లకు చెందిన జీ స్వర్ణగౌరీ రూ.50వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఏ సుబ్బరత్నం, ఎం రవిబాబుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేస్తోందని తెలిపారు. పదోతరగతి విద్యార్థులకు ఉచితంగా మోడల్ టెస్ట్ పేపర్లను పంపిణీ చేస్తోందన్నారు. చేజర్లకు చెందిన స్వర్ణగౌరీ తన భర్త, విశ్రాంత ఉపాధ్యాయుడు జీ శ్రీధర్‌రావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని యూటీఎఫ్ సేవా కార్యక్రమాల కోసం ఆర్థిక సాయాన్ని అందజేయడంపై ధన్యవాదాలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు ఎస్ రమణయ్య, ఆర్వీ కృష్ణారెడ్డి, ఏ.సుబ్రహ్మణ్యం, ఏ వెంకటేశ్వర్లు, ఎస్ బుజ్జయ్య, మస్తాన్‌బాషా పాల్గొన్నారు.

దేవాంగ సంఘ జిల్లా కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(బారకాసు): జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న హెచ్‌ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడిగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా వార్త రాజేంద్రప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్‌ఈ పముజుల నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ హెచ్‌ఎం గౌరబత్తిన హజరత్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సజ్జా సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి చెప్పరం మల్లికార్జున, గౌరవాధ్యక్షులు కర్ణ రాఘవరావు, కన్నా మధుసూదనరావు, జాగబత్తిన శైలేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన


శకునాలపల్లెలో ఆందోళన చేపడుతున్న సీపీఎం నాయకులు

ఉదయగిరి రూరల్: స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఉదయగిరి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని శకునాలపల్లి పంచాయతీలో ఆదివారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వ నాయకులు వాటిని ఇప్పుడు ఎలా ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ట్రూఅప్ చార్జీల పేరుతో రూ.32 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపితే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే రూ.30వేల కోట్ల భారం మోపిందని విమర్శించారు. మరో నాలుగేళ్లలో ఎంత భారం మోపుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒకలా, వచ్చాక మరోలా వ్యవహరించడం ప్రజలను నిలువునా మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పునరాలోచించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేకపోతే పార్టీలకతీతంగా ప్రజలు, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. సీపీఎం నాయకులు పీ వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటాద్రి, చిన్నరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌ఎస్‌ఏ ఆత్మకూరు డివిజన్ కార్యవర్గ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

ఆత్మకూరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ యూనిట్ కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఉదయగిరి తహసీల్దార్ ఎల్ రామ్మోహన్‌ను అధ్యక్షుడిగా, ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దార్ డీ శాంతిస్వరూప్‌ను కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏఎస్‌పేట డీటీ జీ వెంకటేశ్వర్లు, వైస్‌ప్రెసిడెంట్–1,2,3లుగా సీతారామపురం డీటీ ఎస్‌కే సందానీబాషా, కలువాయి డీటీ డీ వెంకటేశ్వర్లు, అనంతసాగరం తహసీల్దార్ ఆఫీస్ సబార్డినేట్ మీరామొహిద్దీన్ ఎన్నికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీలుగా సంగానికి చెందిన బీ శ్రీనివాసులు, ఏఎస్‌పేట సర్వే డీటీ విజయ్‌కుమార్, ఉదయగిరి సర్వే డీటీ కే శ్రీనివాసులు, కోశాధికారిగా మర్రిపాడు ఆర్‌ఐ సాయికిరణ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పెంచలయ్య, ఆత్మకూరు ఆర్డీఓ ఆఫీస్ సీనియర్‌అసిస్టెంట్ పీ రవిబాబు, జిల్లా కౌన్సిలర్లుగా ఆత్మకూరు రీసర్వే డీటీ టీ రాజీనారాయణ, అనంతసాగరం ఆర్‌ఐ ఎస్ రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు మహమ్మద్ గయాజ్, జీ సతీష్ నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. ఏపీఆర్‌ఎస్‌ఏ జిల్లా నాయకులు అనిల్‌కుమార్‌యాదవ్, బీ మురళి, డీవీ శేషయ్య ఎన్నికలను పర్యవేక్షించారు.

సంక్షేమ వసతిగృహాల మూత

విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు


మూతపడిన ఇంటిగ్రేటెడ్ వసతి గృహం

ఉదయగిరి రూరల్: సంక్షేమ వసతిగృహాల మూతతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల వసతి గృహాలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. విద్యార్థులు చేరడం లేదనే సాకుతో వీటిని జిల్లా అధికారులు మూసివేస్తున్నారు. గతంలో ఉదయగిరిలో మూడు వసతి గృహాలు ఉండేవి. గత కొన్నేళ్ల క్రితం ఎస్సీ బాలుర వసతి గృహం మూతపడగా, గతేడాది బీసీ బాలుర వసతి గృహాన్ని మూసివేశారు. ఈ ఏడాది ఉదయగిరిలోని బీసీ బాలికల వసతి గృహం, దుత్తలూరు, వరికుంటపాడులోని బీసీ వసతి గృహాలు మూతపడ్డాయి. దీంతో పేద విద్యార్థులను తల్లిదండ్రులు దూర ప్రాంతాలకు పంపి చదివించలేక చదువులు మానిపించి పనులకు పంపుతున్నారు. ఉదయగిరిలోని డీఎన్‌టీ వసతి గృహం శిథిలావస్థలో ఉంది. దానికి దిక్కెవరూ లేకపోవడంతో భవనానికి సంబంధించిన సామగ్రి ధ్వంసం కావడంతో పాటు గదులు అధ్వానంగా తయారయ్యాయి. మందుబాబులు, జూదరులకు ఆవాస కేంద్రంగా మారింది. దుత్తలూరులోని బీసీ వసతి గృహం కూడా శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉంది. కూటమి ప్రభుత్వం వసతి గృహాల మరమ్మతులకు నిధులు విడుదల చేసినా శిథిల భవనాల వసతి గృహాలకు మంజూరు చేయలేదు. ఉదయగిరిలోని ఇంటిగ్రేటెట్ బాలికల వసతి గృహం కూడా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఈ వసతి గృహంలో 400 మంది విద్యార్థులు ఉండే అవకాశం ఉంది. దీనిని కూడా మూసివేశారు. వెనుకబడిన విద్యార్థులు చదువుకునేందుకు ఒక్క వసతి గృహం కూడా లేకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహాలు శిథిలమై పోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు బీసీ విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మూతపడి శిథిలమైపోతున్న డీఎన్‌టీ వసతిగృహం


చెత్త, చెదారంతో అపరిశుభ్రంగా గదులు